
https://trinetnews.com/
# ట్రైనెట్ న్యూస్
తాజా తెలుగు వార్తలు
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
ప్రతి 3 గంటలకు
98497 67747 | 9494184136
7 AM TO 10 AM
సంపుటి: 01 / సంచిక:21 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / ఆదివారం, సెప్టెంబర్ 06,2026

## మానవ మూత్రంతో కరుగుతున్న హిమాలయాలు!

న్యూఢిల్లీ:ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6



ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడానికి ప్రతి సంవత్సరం ప్రయత్నించే పర్వతారోహకుల మూత్రం, ప్రతిక్లైంబింగ్ సీజన్‌లో టన్నుల కొద్దీ మంచును కరిగిస్తున్నదని పరిశోధనలు గుర్తించాయి. ఖుంబు హిమానీనదంపై ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ఏర్పాటు చేస్తుంటారు. కిచెన్లు, షవర్లు, జనరేటర్లు, వై-ఫై, కొన్ని సందర్భాల్లో వేడిచేసే ఫ్లోర్‌లు వంటి ప్రాథమిక సౌకర్యాలతో కూడిన దాదాపు 1,600 గుడారాలు ప్రతి సంవత్సరం ఈ హిమనీనదంపై వెలుస్తాయి.వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే వేడి నేల ఉష్ణోగ్రత పెరుగడానికి కారణమవుతున్నది. 'రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ చేంజ్' జర్నల్‌లో నేపాల్, అమెరికన్ శాస్త్రవేత్తల బృందం ప్రచురించిన ఒక అధ్యయనం, ఈ మానవ కార్యకలాపాలు హిమానీనదాన్ని ఏ విధంగా కరిగిస్తున్నాయో, విపత్తుకు ఎలా బాటలు వేస్తున్నాయో చెప్తున్నది. 26 ఆగస్టు 2026న నేపాల్‌ను ఒక భారీ ఆకస్మిక వరద వణికించింది. ఇది గ్రామాలను కొట్టుకుపోయేలా చేసి 1,200 మందికిపైగా ప్రజలను పొట్టనబెట్టుకున్నది.ఈ విపత్తు మంచు సరస్సు పగలడం వల్ల సంభవించిందని తేలింది. గ్లోబల్ వార్మింగ్, శిలాజ ఇంధనాల వాడకంతోపాటు, మానవ మూత్ర విసర్జన కూడా హిమానీనదం కరుగడానికి ఎలా కారణమవుతున్నదో ఈ కొత్త అధ్యయనం దృష్టి సారించింది. ఎక్కువ ఎత్తులో ఉండటం వల్ల పర్వతారోకులు ఎక్కువ నీరు తాగాల్సి వస్తున్నది. దీనివల్ల వారు ఎక్కువ మూత్ర విసర్జన చేస్తారు. పరిశోధకుల ప్రకారం.. 2023 సీజన్‌లో రోజుకు దాదాపు 6,766 లీటర్ల మూత్రం ఉత్పత్తి అయింది. మూత్రం ఒక్కటే చాలా వేడిని కలిగి ఉంటుందని, ఇది హిమానీనదం గణనీయంగా కరుగడానికి సరిపోతుందని తేలింది. ఆ వేడి పరిమాణం ఎంత మంచును కరిగిస్తున్నదో అంచనా వేస్తూ, ఆ ఒక్క క్లైంబింగ్ సీజన్‌లోనే హిమానీనదం 154 టన్నుల మంచును కోల్పోయిందని పరిశోధకులు తెలిపారు.

### ఇంధనమే అతిపెద్ద కారణం

మూత్రం కంటే పెద్ద సమస్య బేస్ క్యాంప్‌లో ఇంధన వినియోగం. 2023 సీజన్‌లో వంట, వేడి, విద్యుత్తు కోసం 824 ఎల్పీజీ సిలిండర్లు, 18,935 లీటర్ల కిరోసిన్, 5,130 లీటర్ల గ్యాసోలిన్ ఉపయోగించారు. మానవుల వల్ల జరిగే కరుగుదలలో ఇది దాదాపు 94 శాతం.

## రామప్ప ఆలయంలో చారిత్రక ఘట్టం..

### 300 ఏళ్ల తర్వాత రుద్రేశ్వరుడికి పూర్తిస్థాయి జలాభిషేకం

- 17వ శతాబ్దంలో భూకంపం వల్ల మూసుకుపోయిన సోమసూత్రం పునరుద్ధరణ
- ఆధునిక టెక్నాలజీతో ఆలయానికి నష్టం లేకుండా పనులు చేపట్టిన ఏఎస్ఐ
- పురావస్తు, దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో విజయవంతమైన పనులు

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6



ములుగు జిల్లాలోని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో ఒక చారిత్రక ఘట్టం చోటుచేసుకుంది. సుమారు 300 సంవత్సరాలుగా నిలిచిపోయిన పూర్తిస్థాయి నిత్య జలాభిషేకం శనివారం నుంచి మళ్లీ ప్రారంభమైంది. ఆలయంలోని గర్భగుడిలో కొలువుదీరిన రుద్రేశ్వర స్వామికి సంపూర్ణ అభిషేకాలు చేసేందుకు మార్గం సుగమమైంది. 17వ శతాబ్దంలో సంభవించిన భూకంపం కారణంగా గర్భగుడి నుంచి అభిషేక జలాలు బయటకు వెళ్లే సంప్రదాయ మార్గం 'సోమసూత్రం' మూసుకుపోయింది. దీంతో ఇన్ని శతాబ్దాలుగా స్వామివారికి పరిపూర్ణ అభిషేకాలు నిర్వహించడం సాధ్యపడలేదు. ఈ నేపథ్యంలో పురావస్తు శాఖ (ఏఎస్ఐ) హైదరాబాద్ సర్కిల్ బృందం, దేవాదాయ శాఖ అధికారులు కలిసి శాస్త్రీయ పద్ధతిలో పునరుద్ధరణ పనులు చేపట్టారు.ఆలయ నిర్మాణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా 3డీ మ్యాపింగ్, ఎండోస్కోపిక్ కెమెరాల సహాయంతో అడ్డంకులను గుర్తించారు. అనంతరం 'సాఫ్ట్ డ్రిల్లింగ్' అనే ఆధునిక విధానాన్ని ఉపయోగించి పొరలుపొరలుగా అడ్డంకులను జాగ్రత్తగా తొలగించారు. దీంతో మూడు శతాబ్దాల తర్వాత సోమసూత్రం తిరిగి వినియోగంలోకి వచ్చింది.

## ప్రపంచ సుందరిగా జోహీర్రీ మోలా..

### డొమెనిక్ రిపబ్లిక్ భామను వరించిన కిరీటం

న్యూఢిల్లీ: ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6





రిపబ్లిక్‌కు చెందిన జోహీర్రీ మోలా ప్రపంచ సుందరి కిరీటాన్ని దక్కించుకున్నారు. వియత్నాంలోని న్హా ట్రాంగ్‌లో శనివారం జరిగిన 73వ ఎడిషన్ మిస్ వరల్డ్ 2026 గ్రాండ్ ఫినాలేలో జోహీర్రీ ప్రథమ స్థానంలో నిలిచి కిరీటాన్ని ఎగరేసుకుపోయారు. 110 దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొన్న ఈ పోటీలో స్పెయిన్ భామ ఎలిజబెత్ రెయిన్స్ మొదటి రన్నరప్‌గా, మలేషియాకు చెందిన తనుసియా శెట్టి రెండో రన్నరప్‌గా నిలిచారు. 2025లో మిస్‌వరల్డ్ కిరీటాన్ని దక్కించుకున్న థాయ్‌లాండ్‌కు చెందిన ఒపల్ సుచతా చువాంగ్ స్రీ.. జోహీర్రీకి మిస్‌వరల్డ్ కిరీటం తొడిగారు. కాగా, ఈ పోటీల్లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన మధ్యప్రదేశ్ ఉజ్జయినీకి చెందిన నటి, మిస్ ఇండియా వరల్డ్ 2024 నికితా పోర్వల్ టాప్-40 ఫైనలిస్ట్‌లలో ఒకరిగా నిలిచారు.

## మంత్రివర్గంలోకి మహేశ్ గౌడ్..

### కొత్త పీసీసీ చీఫ్ ఎవరు?

- ఈ నెలాఖరులోగా తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం
- మంత్రివర్గంలోకి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ చేరిక దాదాపు ఖాయం
- కొత్త పీసీసీ చీఫ్ రేసులో పొన్నం ప్రభాకర్, బలరాం నాయక్ పేర్లు
- మంత్రి పదవుల కోసం పలువురు సీనియర్ నేతల గట్టి ప్రయత్నాలు
- అసెంబ్లీ సమావేశాల తర్వాత ఢిల్లీలో అధిష్ఠానం తుది నిర్ణయం

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6



తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెలాఖరులోగా కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించి, ఖాళీగా ఉన్న మూడు బెర్తులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విస్తరణలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.మహేశ్ గౌడ్ రెండేళ్ల పీసీసీ అధ్యక్ష పదవీకాలం ఈ నెల 15తో ముగియనుండటంతో, ఆయనను కేబినెట్‌లోకి తీసుకుని పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించాలని అధిష్ఠానం యోచిస్తోంది. కొత్త పీసీసీ చీఫ్ రేసులో మంత్రి పొన్నం ప్రభాకర్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.మరోవైపు, మంత్రి పదవుల కోసం పలువురు సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలున్నాయని చర్చ నడుస్తోంది. సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ విజయశాంతి, మహిళా కోటాలో నలమాద పద్మావతీ రెడ్డి కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు తనకు మంత్రి పదవి ఇవ్వాలని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే కోరుతున్నారు. అయితే ఆయన సోదరుడు వెంకటరెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉండటంతో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి నెలకొంది.అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ అధిష్ఠానం తుది విడత చర్చలు జరపనుంది. ఆయన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది జాబితాను ఖరారు చేయనుంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహేశ్ గౌడ్‌లను కూడా ఢిల్లీకి పిలిపించి మాట్లాడనున్నట్లు తెలుస్తోంది.

## తిరుమలలో భక్తజన సంద్రం.. సర్వదర్శనానికి 24 గంటలు!

- వారాంతం కావడంతో తిరుమలకు పోటెత్తిన భక్తులు
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు
- శనివారం ఒక్కరోజే స్వామివారిని దర్శించుకున్న 84 వేల మంది భక్తులు
- నిన్న రూ.4.08 కోట్లుగా నమోదైన శ్రీవారి హుండీ ఆదాయం



ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6

తిరుమల పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడుతోంది. వారాంతపు సెలవుల నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ పూర్తిగా నిండిపోయాయి. క్యూలైన్లు కాంప్లెక్స్ వెలుపలికి విస్తరించి బాట గంగమ్మ ఆలయం వరకు చేరుకున్నాయి. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వామివారి దర్శనానికి గంటల తరబడి సమయం పడుతోంది.ఆదివారం ఉదయం 8 గంటల తర్వాత సర్వదర్శనం క్యూలైన్లలో ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం లభించేందుకు సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. అదేవిధంగా, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 4 నుంచి 6 గంటలు, సర్వదర్శనం టోకెన్లు పొందిన భక్తులకు 5 నుంచి 7 గంటల సమయం పడుతుందని వివరించారు.తిరుమలలో నెలకొన్న రద్దీ తీవ్రతను శనివారం నాటి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నిన్న ఒక్కరోజే మొత్తం 84,166 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 36,673 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కానుకల రూపంలో శ్రీవారి హుండీకి రూ.4.08 కోట్ల ఆదాయం సమకూరింది. భక్తుల రద్దీకి అనుగుణంగా టిటిడి అధికారులు 4.74 లక్షల లడ్డూలను విక్రయించారు.

## హైదరాబాద్ విషప్రయోగం కేసు

### : యూకే ఫార్మసిస్ట్ అప్పగింతకు లండన్ కోర్టు గ్రీన్ సిగ్నల్

- మాజీ భార్య కుటుంబంపై విషప్రయోగం కేసులో కీలక పరిణామం
- ప్రధాన నిందితుడు, యూకే ఫార్మసిస్ట్ అజిత్ కుమార్‌ను భారత్‌కు అప్పగించాలి
- ఈ మేరకు లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ కోర్టు ఆదేశాలు జారీ
- ఆహారంలో ఆర్సెనిక్ కలిపి అత్త మృతికి కారణమయ్యాడన్న ఆరోపణలు
- మామ హత్యకు కూడా కుట్ర పన్నాడనే అభియోగాలు

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6



హైదరాబాద్ లోని మియాపూర్‌లో మూడేళ్ల క్రితం జరిగిన సంచలన విషప్రయోగం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. మాజీ భార్య కుటుంబాన్ని అంతమొందించేందుకు కుట్ర పన్ని, అత్త మృతికి కారణ మయ్యాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న యూకే ఫార్మసిస్ట్ అజిత్ కుమార్ ముప్పారపు (46)ను భారత్‌కు అప్పగించేందుకు లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు అనుమతి ఇచ్చింది.భారత సంతతికి చెందిన యూకే పౌరుడైన అజిత్ కుమార్ నుంచి విడాకులు కోరుతూ అతడి భార్య శిరీష 2023లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని మియాపూర్‌లో జరిగిన ఓ వివాహానికి శిరీష కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. ఇదే అదనుగా భావించిన అజిత్, వారిని హతమార్చేందుకు పథకం పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంట్లో వాడే ఉప్పు, కారంలో ఆర్సెనిక్ విషాన్ని కలిపాడని, ఆ ఆహారం తిన్న శిరీష తల్లి ఉమామహేశ్వరి తీవ్ర అస్వస్థతకు గురై 2023 జులై 5న మరణించారు.

# గర్జించిన యువత

సర్కార్‌ను నిగ్గదీసిన నిరుద్యోగులు

జాబ్ క్యాలెండర్ ఏదీ? భృతి ఏమైంది?

కాంగ్రెస్ నయవంచనపై జంగ్ సైరన్

మాట తప్పిన.. మడిమ తిప్పిన ప్రభుత్వంపై పోరుగర్జన

హామీల అమలు ఎప్పుడంటూ.. నిలదీత

యువ పోరాటానికి అండగా బీఆర్ఎస్ జెండా

నిరసనలతో హోరెత్తించిన గులాబీ శ్రేణులు

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6

**మాట తప్పిన.. మడిమ తిప్పిన సర్కార్‌పై యువత గర్జించింది.. విఫల కాంగ్రెస్ సర్కార్‌పై కన్నెర్ర చేసింది. నిరసనలతో హోరెత్తించింది. యూత్ డిక్లరేషన్.. ఉద్యోగాల భర్తీ.. నిరుద్యోగ భృతి.. యువతులకు స్కూటీలు ఇలా.. అనేక రకాల హామీలు ఇచ్చి.. మోసం చేసిన కాంగ్రెస్‌ను నిలదీసింది. యువత పోరాటానికి బీఆర్ఎస్ జెండా అండగా నిలిచింది. విద్యార్థులు, నిరుద్యోగులు, యువతీయువకులను ఏకం చేసి..వెయ్యి రోజుల విఫల పాలనను నిరసిస్తూ.. శనివారం బీఆర్ఎస్ యువతతో కలిసి కాంగ్రెస్ సర్కార్‌ను హామీల అమలు ఎన్నడని ప్రశ్నించింది. ఈ పోరుగర్జనలో ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి , మాధవరం కృష్ణారావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పద్మారావుగౌడ్ భాగస్వాములయ్యారు. ర్యాలీలు, వంటావార్పు, ప్లకార్డుల ప్రదర్శన, పాదయాత్ర ఇలా.. వివిధ రూపాల్లో కాంగ్రెస్ సర్కార్‌కు కనువిప్పు కలిగేలా.. యువత పోరాటానికి తోడుగా గులాబీ శ్రేణులు కదం తొక్కారు. విద్యార్థుల హక్కుల కోసం, నిరుద్యోగ యువత భవిష్యత్ కోసం, ఉద్యోగ హామీల అమలయ్యేంత వరకు బీఆర్ఎస్ పోరాటం విశ్రమించదని స్పష్టం చేశారు.**

'కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులను నిలువునా మోసం చేసింది. యూత్ డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యార్థి లోకానికి తీరని అన్యాయం చేసింది. నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టి యువతను నిలువునా మోసం చేశారు. యువతులకు స్కూటీలు ఇస్తామని మొండిచేయి చూపారు. వెయ్యి రోజుల పాలనలో భావి తెలంగాణ పౌరులైన యువతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. స్వయానా ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రిగా ఉండి విద్యను తీవ్ర నిర్లక్ష్యం చేశారు' అంటూ వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ గ్రేటర్ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కాయి. విద్యార్థి, నిరుద్యోగులను ఏకం చేసి కాంగ్రెస్ దగా సర్కారుపై జంగ్ సైరన్ మోగించారు. నిరసనలు, బైక్ ర్యాలీలు, ధర్నాలతో నగరమంతా హోరెత్తించారు. వెయ్యి రోజుల్లో యువతకు కాంగ్రెస్ సర్కారు చేసిన మోసాన్ని విద్యార్థులకు వివరించారు. కాంగ్రెస్ ఎగ్గొట్టిన హామీలను వివరిస్తూ బాకీ కార్డులను పంపిణీ చేశారు. గ్రేటర్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఈ నిరసనల్లో వేలాదిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి వాడవాడల ర్యాలీలు తీశారు. కాంగ్రెస్ సర్కారుకు కనువిప్పు కలిగేలా జంగ్‌సైరన్ మోగించారు.

### ప్రభుత్వ మోసంపై నిరసన ర్యాలీలు

యువత, విద్యార్థులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ దగా ప్రభుత్వంపై విద్యార్థులు, యువతతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు నిర్వహించిన నిరసనలు దద్దరిల్లాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగుల, పేదలు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోజరిగిన నిరసనలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, ఇచ్చిన ఏ ఒక్క






హామీని అమలు చేయలేదని ఆరోపించారు. ఉప్పల్ నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

### హోరెత్తిన బీఆర్ఎస్ నిరసనలు

గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ శ్రేణులు వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టాయి. ఉప్పల్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ నుంచి రాధిక చౌరస్తా వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ శ్రేణులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మూసాపేట డివిజన్‌లో నిరసనలు చేపట్టారు. మాజీ కార్పొరేటర్లు తూము శ్రవణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ యువ నేత మన్నె క్రిషాంక్ సంగీత్ చౌరస్తా వద్ద పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నాకు మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడి భరోసా కల్పించారు. మలక్‌పేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తీగల అభిజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో విద్యార్థులతో నిరసన ర్యాలీ చేపట్టారు. బీఆర్ఎస్ నేత ఆజం అలీ, చెల్లూరి రఘునందన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింగ్, టిన్ను సింగ్, నరేష్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్, కొత్తపేట చౌరస్తా నుంచి ఎన్టీఆర్‌నగర్ మీదుగా పాదయాత్ర చేపట్టారు. బీఆర్ఎస్ శ్రేణులు, విద్యార్థులు, నిరుద్యోగులు వందలాదిగా పాల్గొన్నారు.సనత్‌నగర్‌లో ఎమ్మె ల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాలతో రాంగోపాల్‌పేట, బేగంపేట, బన్సీలాల్‌పేట, అమీర్‌పేట, సనత్‌నగర్, పద్మారావు నగర్ డివిజన్‌లలో నిరసనలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, జగన్, సురేష్‌రెడ్డి, మహ్మద్రీఫ్, దుండిగల్ మాజీ ఛైర్మన్ సత్యనారయణ తదితరలు పాల్గొన్నారు. ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ యువనేత ముఠా జయసింహ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, ఉపాధి అవకాశాలపై నిరసన చేపట్టారు. ఎడ్ల హరిబాబు, శ్రీనివాస్‌రెడ్డి, ముఠా పద్మ తదితరులు పాల్గొన్నారు. మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ఆధ్వర్యంలో తార్నాకలో భారీ ర్యాలీ నిర్వహించారు.

---



## జపాన్ పర్యటనకు కర్ని పాఠశాల పీడీ బి.రూప ఎంపిక..

### విద్యా విధానాలపై అధ్యయనం


మక్తల్,ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6 :

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల క్రీడా, విద్యా వికాసానికి కృషి చేస్తున్న ఓ ఫిజికల్ డైరెక్టర్‌కు అంతర్జాతీయ స్థాయిలో విద్యా విధానాలను అధ్యయనం చేసే అరుదైన అవకాశం లభించింది. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ బి.రూప (రాూ––ూాష్ట్రంఎంఅఝుశ్రీ జుఎబఝ్ఞఅశీఅ) జపాన్ పర్యటనకు ఎంపికయ్యారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను జపాన్ పర్యటనకు పంపుతోంది. సెప్టెంబర్ 5 నుంచి 12 వరకు కొనసాగనున్న ఈ పర్యటనలో రాష్ట్రానికి చెందిన 29 మంది ఉపాధ్యాయులు, 11 మంది విద్యాశాఖ అధికారులు పాల్గొంటున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, నిరుపేద విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించడంతో పాటు.. అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.ఈ పర్యటనలో భాగంగా బి.రూప జపాన్‌లోని విద్యా సంస్థలను సందర్శించి అక్కడి క్రమశిక్షణ, సాంకేతికత వినియోగం, జీవన నైపుణ్యాల బోధన, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, పాఠశాల నిర్వహణ విధానాలను పరిశీలించనున్నారు. జపాన్‌లో అమలు చేస్తున్న ఉత్తమ బోధనా పద్ధతులను అధ్యయనం చేసి.. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో అనుసరించదగిన విధానాలపై అవగాహన పొందనున్నారు. ఈ అనుభవం భవిష్యత్తులో విద్యార్థులకు మరింత మెరుగైన బోధన అందించేందుకు ఉపయోగపడనుంది.కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బి.రూప విద్యార్థుల క్రీడా, విద్యా అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆమెకు అంతర్జాతీయ స్థాయి విద్యా పర్యటనకు అవకాశం దక్కడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల నుంచి జపాన్ వరకు బి.రూప సాగిస్తున్న ఈ ప్రయాణం కర్ని పాఠశాలకే కాకుండా నారాయణపేట జిల్లాకు కూడా గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. జపాన్ పర్యటన విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు.

## గద్వాల జిల్లాలో ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు- ఇద్దరు మృతి

ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6

జోగులాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 44వ జాతీయ రహదారిపై టెన్త్ పతాలం ఎదురుగా ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కన ఆగివున్న లారీని ఓ కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను మౌనిక, సాయికుమార్‌గా గుర్తించారు. గాయపడిన వ్యక్తిని ముఖేశ్‌గా గుర్తించారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఈ యాక్సిడెంట్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి అసలు కారణం అతి వేగమా? డ్రైవర్ నిర్లక్ష్యమా? ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



## ఆర్టీసీ భూములను ఇందిరమ్మ ఇండ్లకు ఎలా ఇస్తారు..

### ప్రభుత్వానికి ఎంప్లాయీస్ యూనియన్ లేఖ

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6

ఆర్టీసీ స్థలాలు సంస్థ, కార్మికుల సంక్షేమం కోసం ఉపయోగించకుండా ఇందిరమ్మ ఇండ్లకు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంప్లాయీస్ యూనియన్ శనివారం లేఖ రాసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ స్థలాలను కబళించాలని చూస్తున్నదని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ బాబు, ఈదురు వెంకన్న మండిపడ్డారు.ప్రపంచ పటాలు పరిశీలించండి




# 10వేలు ఎప్పుడిస్తరు!..

## ఇందిరమ్మ ఇండ్లు దక్కని దరఖాస్తుదారుల ఆందోళన

మేడ్చల్,ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 6




ఇందిరమ్మ ఇండ్ల(టవర్స్) దరఖాస్తుల రుసుం పైసలు ఎప్పుడు ఇస్తారని లాటరీలో దక్కని ఇందిరమ్మ దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో ఇందిరమ్మ(టవర్స్) నిర్మాణాలకు ఇటీవలే లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఉప్పల్ నియోజకవర్గం మినహా నియోజకవర్గానికి 480 చొప్పున జీప్లస్10 టవర్స్‌ను నిర్మించేందుకు 1920 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా ఎంపిక కాని దరఖాస్తుదారులకు రూ. 10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారి పైసలు తిరిగి ఎప్పుడు ఇస్తారని ఎదురు చూస్తున్నారు.నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇండ్ల(టవర్స్)కు 14,201 దరఖాస్తులు వచ్చిన విషయం విధితమే. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లు(టవర్స్)ను అందించనున్నట్లు అధికారులు పేర్కొంటున్న నేపథ్యంలో లాటరీలో ఎంపికైన లబ్ధిదారుల దరఖాస్తులపై మరో మారు విచారణ చేస్తున్నట్లు స్పష్టం చేస్తున్నారు.మూడు రోజుల క్రితమే విచారణ ప్రారంభించామని, విచారణలో అనర్హులుగా తేలితే ఇందిరమ్మ ఇండ్లు(టవర్స్)ను రద్దు చేసి అర్హత ఉన్నవారికి తిరిగి లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇదంతా తేలిన తర్వాతే లాటరీలో ఇండ్లు దక్కని దరఖాస్తుదారులకు తిరిగి దరఖాస్తు రుసుం రూ. 10 వేలు చెల్లించే అవకాశం ఉందని తెలుస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు అనేక మంది అప్పులు చేశారని తెలుస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్‌రూమ్‌లను ఉచితంగానే నిరుపేదలకు ఇచ్చిన విషయాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారు.